

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు :అల్లీపురం ప్రాంతంలోని చెత్త డంపింగ్ యార్డును నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, పొల్యూషన్ కంట్రల్ బోర్డు చైర్మన్ డాక్టరు కృష్ణయ్యతో కలిసి ఆదివారం పరిశీలించారు. అల్లీపురం ప్రాంతంలోని డంపింగ్ యార్డు, ఎస్.టి.పి విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌టిపి గురించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న వెహికల్ షెడ్ వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న చెత్త బండలను పరిశీలించారు. ఇంజినీరింగ్ ఇఇ.జాని ఎం.హెచ్.ఓ., చైతన్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

జిల్లాకు తుపాన్ హెచ్చరిక..

మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం - అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి- నెల్లూరు

అల్పపీడనం ,తూఫాను కారణంగా రానున్న 3 రోజులు జిల్లాలో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఓ ఆనంద్ వెబ్‌ఎక్స్ ద్వారా అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ సమావేశలో అధికార యంత్రాంగాన్ని ఉద్దేవించి మాట్లాడారు. రానున్న 3,4 రోజుల్లో జిల్లాకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచనలు చేశారు. భారీ వర్షాలు ,తుఫాను వచ్చి నట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధం గా ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆ కంట్రోల్ రూమ్ లో మూడు షిఫ్టులలో సిబ్బందికి డ్యూటీలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 0861-2331261. -7995576699 -1077 సిద్ధం చేశామన్నారు. డివిజన్ ,మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఓలు, తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల రాదని ఆంక్షలు విధించామన్నారు. ఎవరైనా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి ఉంటే ఈరోజు(ఆదివారం) సాయంత్రానికి తిరిగి బయటకు రావాలని సూచించారు. పెన్నా నది గట్లు

కలెక్టర్ ఓ ఆనంద్

బలహీనంగా ఉన్నా, గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గండ్లు పడకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా, మైక్ ప్రచారం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని గ్రామ స్థాయి అధికారులను కోరారు. భారీ వర్షాలు, తుఫాను సంభవిస్తే సురక్షిత ప్రాంతాలకు ముంపు ప్రాంత ప్రజలు చేరుకోవాలన్నారు. సముద్ర తీరా ప్రాంతంలో పూరి గుడిసెలు ,తాటాకు ఇళ్లలో ఉండే ప్రజలు పక్కా భవనాల్లో,తూఫాన్ షెల్టర్లకు చేరుకోవాలన్నారు. పెన్నా నదికి వరద వస్తే నదీ పరివాహక ప్రాంతంలో ముంపుకు గురి అయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సంబందింత శాఖ అధికారులకు సూచనలు చేశారు. వరదలు సంభవిస్తే ప్రజల ప్రాణాలను రక్షించేందుకు అవసరమైన బోట్లు కోసం, జెసిబి యంత్రాల కోసం సంబంధిత యజమానులతో మాట్లాడి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వాటిని అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను, మనుషులను సిద్ధం చేసుకోవాలన్నారు. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయలు , వాహనాలు, డీజిల్ సిద్ధంగా ఉంచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో తాగునీటి ట్యాంకులలో ముందుగానే నీటి నింపుకొని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు సెలవులు ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులలో అత్యవసర మందులు, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేసి ఒక్క ప్రాణ నష్టంగాని, పశు నష్టం గాని జరగ కుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

జిల్లాకు భారీ వర్షాలు, తుఫాను ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నేడు కలెక్టరేట్ , కార్పోరేషన్ కార్యాలయాల్లో నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కందుకూరులో వర్షం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరి డివిజన్లో గత వారం రోజులుగా ప్రతిరోజు వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం కందుకూరు డివిజన్లో 40. 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వలేటివారిపాలెం మండలంలో 4. 6 మిల్లీమీటర్లు, కందుకూరు మండలంలో 25.0మిల్లీమీటర్లు, గుడ్లూరు మండలంలో 2.2 మిల్లీమీటర్లు, వరికుంటపాడు మండలంలో 8. 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ వర్షం రైతులకు కొంతమేరకు ఉపయోగపడుతుంది.

లోకేష్‌ను కలిసిన ఇంటూరి

లోకేష్‌ను కలిసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు :మంత్రి నారా లోకేష్‌ని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ ఉండవల్లిలో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు కలిసి నియోజకవర్గంలోని వివిధ అభివద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించే విధంగా చూడాలని లోకేష్‌ని కోరారు. రామాయపట్నం పోర్టు ప్రాంతంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసియల్)ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం కందుకూరు నియోజకవర్గంలోని పలువురు దాతలు అందించిన 4,65,726 రూపాయల విరాళాన్ని లోకేష్‌కి నాగేశ్వరరావు అందజేశారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో విజయవాడ వరద బాధితులకు తమవంతుగా పలువురు సాయంచేస్తూ దాతత్వం చాటుకుంటున్నారు. కందుకూరు పట్టణానికి చెందిన తల్లపనేని నర్సింగరావు రూ 10000, కందుకూరు మండలం, మోపాడుకు చెందిన తోకల రవికుమార్ 10,000, కందుకూరు మండలం మండలం పంటవారి పాలెం గ్రామానికి చెందిన మన్నం రమణయ్య 10,000 విరాళాన్ని వరద బాధితుల కోసం ఆదివారం ఎంఎల్‌ఎ నాగేశ్వరరావుకి అందించారు.మొత్తం 30000 విరాళాలను దాతలు అందజేయడం జరిగింది. వీరందరినీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభినందించారు.

ప్రజా సమస్యలపై సిపిఎం సర్వే

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 54వ డివిజన్ పరిధిలోని జనార్దన్ రెడ్డి కాలనీ 7వ నెంబర్ బూత్ ప్రాంత పరిధిలో గత వారం రోజుల నుంచి ప్రజా సమస్యలపై స్థానిక సిపిఎం శాఖ సభ్యులు సర్వే నిర్వహిస్తున్నారు. జనార్ధన్‌రెడ్డి కాలనీ ప్రాంత ప్రజలు సిపిఎం సర్వే దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారు.ఆ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో చెట్లు పెరిగిపోయి విష సర్పాలు తిరుగుతున్నాయన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం, మురుగు నీరు నిండిపోయి దుర్గంధభరితమైన వాసనలు వెదజల్లు తున్నాయన్నారు. దోమల నిలయాలుగా మారిపోతున్నాయన్నారు. దోమ కాటు వల్ల పలు వ్యాధులు ప్రభలి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురౌతున్నారన్నారు. శ్మశానం చివర బజారులో కరెంటు స్తంభాలు లేక రాత్రిపూట చీకటిగా ఉంటుందని ఆ ప్రాంతంలో స్తంభాలు వేసి కరెంటు లైట్లు వేయాలని కోరారు . కార్పోరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కలుషితం అవుతున్నాయన్నారు. కార్పోరేషన్ అధికారులు స్పందించి కనీసం ఈ ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పారిశుద్య కార్మికుల సంఖ్యను పెంచి, పారిశుద్య సమస్యను పరిష్కరించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని, కుళాయిలు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లు చిన్నచిన్న లీకేజీలను గుర్తించి మరమ్మత్తులు చేయించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగేశ్వర రావు సిపిఎం పార్టీ 7వ బూత్ కన్వీనర్ నూతలపాటి సురేష్, సిపిఎం పార్టీ సభ్యురాలు మహాలక్ష్మమ్మ డివైఎఫ్ఐ 7వ నెంబర్ బూత్ నాయకులు వాజిద్, సుల్తాన్, దావూద్, ముని, పండు, అబ్బాస్,షాహుల్, జీవన్, సిద్ధిక్ ఉన్నారు.

సర్వే చేస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యోగులకు సెలవులు రద్దు :కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, సెలవులపై వెళ్లిన వారు సైతం తక్షణమే విధుల్లోకి హాజరు కావాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లాలోని అన్ని డివిజన్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్‌ను సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ పిలుపు నిచ్చారు. ఆదివారం విద్యుత్తు శాఖ అధికారులతో ఆయన అత్యవసరంగా టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన పలువురు అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ఎక్కడ ఏ ఇబ్బంది తలెత్తకుండా అన్ని డివిజన్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మనకు కావాల్సిన మ్యాన్ పవర్ ను ఉంచుకోవాలని, కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే సిబ్బందిని, షిఫ్ట్ ఆపరేటర్లను ,లేబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కమ్యూనికేషన్ లో ఉండే విధంగా సెల్ ఫోన్ చార్జింగ్ పూర్తిగా పెట్టుకొని ఉండాలని, అవసరమైతే వాకీటాకులను ఉపయోగించుకోవాలని ఎక్కడైనా ఈదురు గాలులకు స్తంభాలు పడిపోతే వెంటనే స్తంభాలు మార్చాలని తెలిపారు.

వెండి కిరీటం, పట్టు వస్త్రాలను అందజేస్తున్న ప్రసాద్,యామిని దంపతులు

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి - లింగసముద్రం :నవరాత్రుల సందర్భంగా లింగసముద్రంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర బేకరీ యజమాని రాయళ్ల ప్రసాద్ వెండి కిరీటాన్ని బహుకరించారు.ఒక లక్ష ముప్పై వేలు విలువచేసే వెండి కిరీటానికి విజయదశమి రోజు నవరాత్రుల చివరి రోజు అయిన శనివారం ఆలయంలో రాయళ్ళ ప్రసాద్ యామినిసరస్వతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెండి కిరీటాన్ని పట్టు వస్త్రాలతో కలిపి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త అడపా రంగయ్య,ప్రధాన అర్చకులు వెల్లటూరి రాధా కష్ణలకు అందజేశారు.అనంతరం స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా అడపా రంగయ్య మాట్లాడుతూ స్వామి వారి పట్ల అత్యంత విశ్వాసంతో కూడిన భక్తుడిగా ప్రసాద్ ఉన్నారని,ఆయనస్వామివారికి వెండి కిరీటం చేయించడం అభినందనీయమన్నారు.

వికలాంగులకు చేయూత

ప్రజాశక్తి-కందుకూరు :.ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుద్దాం.. వారి కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో అడుగులు వేస్తూ శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోకూరుకు చెందిన కీ.శే. గుర్రం రుక్మిణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు సత్యనారాయణ, వెంకట సుధారాణి దంపతులు ,మనవళ్ళు కిషోర్, శ్రీ హరికష్ణ సహకారంతో కోవూరు రోడ్డు లోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల ఆశ్రమం, పాపానాయుడు పేటలోని లక్ష్మీ నరసింహా అనాధ మానసిక వద్ధుల ఆశ్రమాల్లో మధ్యాహ్న అన్నదానంఏర్పాటుచేశారు. శ్రీరామసాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని నరసాపురం దగ్గర నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లోడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు ఆదివారం తెలిపారు. మండలంలోని జానకంపేట సమీపంలో ఉన్న ఉప్పుటేరు నుంచి గత కొంతకాలంగా ఆక్రమంగా ఇసక కావలకి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న ఇసుకలోడు డాక్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-కందుకూరు :రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలో నేడు ఉదయం 10:30 కు చాకిచెర్ల పంచాయతీ, 11 గంటలకు పెదపట్టపుపాలెం, మధ్యాహ్నం 12:30 కు చాగొల్లు పంచాయతీలలో అంతర్గత సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని ఎంయల్‌ఎ కార్యలయం ఆదివారం ప్రకటనలో తెలిపింది.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి-కందుకూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపాన్‌గా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడ్లూరు ఎస్ఐ వెంకట్రావు ప్రజలకి విజ్ఞప్తి చేశారు. ఈనెల 14 నుంచి 16వ తారీకు లోపు తుపాన్ వచ్చే ప్రమాదం ఉందని, తీరం వెంబడి గ్రామాల ప్రజలు అవసరమైన నిత్యవసర సరుకులు ముందుగానే తెచ్చుకొని నిల్వ ఉంచుకోవాలన్నారు. మత్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

నరుకూరు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య

పట్టించుకోని రూరల్ పోలీసులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని నరుకూరు సెంటర్ నిత్యం ట్రాఫిక్ చట్రంలో చిక్కుకుంటోంది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించు కోవడం లేదు. ఫలితంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. నరుకూరు సెంటర్ నెల్లూరు రూరల్ మండల పరిధిలోకి వస్తుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్‌ను నియం త్రించే బాధ్యత రూరల్ పోలీసులది.ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై రూరల్ పోలీసులు చర్యలు తీసు కునే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈ సెంటర్లో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. దీంతో అటు ప్రజలు, ఇటు వాహనాల చోదకులు అనేక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. దుకాణాల యజమానులు ఏకంగా సగం రోడ్డును ఆక్రమించు కోవడంతో వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఆదివారాల్లో ఈ సెంటర్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటుంది. అధిక సంఖ్యలో చేపలు, చికె న్, మటన్ అంగళ్లు దర్శనవి ్తస్తాయి.దీంతో పాదచారు లు సైతం అవస్థలు పడుతుంటారు. మరోవైపు మందు బాబులు తమ వాహనాలను నడి రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహ నాల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతుంటే, ఇక ఆటోలు కార్లు, ట్రాక్టర్లు, బస్సులు, లారీల రాకపోకల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పొంచివున్న రోడ్డు ప్రమాదాలు

ఇక ఆదివారాలు, పర్వదినాలలో ఇక్కడ పరిస్థితి "దిన దినగండం..నూరేళ్ల ఆయుష్షు" అన్న చందంగా మారింది. జిల్లా వ్యాప్తంగా తోటపల్లి గూడూరు మండలం కోడూ రు బీచ్‌కి వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటో లు, కార్లు తదితర వాహనాల్లో ప్రజలు వస్తుంటారు. అత్యంత వేగంతో వాహనాలు ఈ సెంటర్ గుండా కోడూరు బీచ్ కు వెళుతుంటాయి.వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు సరైన స్పీడ్ బ్రేకర్స్ లేవు. వాహనాల వేగాన్ని ని యంత్రించేందుకు పోలీసులు లేకపోవడంతో ఈ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ట్రాఫిక్ బం ధనంలో వుంటున్న నరుకూరు సెంటర్లో పరిస్థితి చక్కది ద్దే విషయంలో రూరల్ పోలీసులు అనుసరిస్తున్న నిర్ల క్ష్య వైఖరి పట్ల ప్రజలు తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికయినా పోలీసు ఉన్నత అధికారులు జో క్యం చేసుకొని నరుకూరు సెంటర్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నరుకూరు సెంటర్‌లో ట్రాఫిక్ ఇలా..

ప్రజా ఉద్యమాలే సిపిఎం లక్ష్యం..

ప్రజాశక్తి - కోవూరు :ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి. శేషయ్య తెలిపారు. పట్టణంలోని కామ్రేడ్ సీతా పోలయ్య కార్యాలయంలో 4వ మండల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలని ఉద్యమించడంతో నేడు ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయకుంటే ఉద్యమించడం తప్పదన్నారు. జిల్లా నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వైఫల్యం చెందినట్లు పేర్కొన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు, నూనె ధరలు అమాంతంగాపెరిగి పోవడం దారుణమన్నారు. కార్యక్ర మంలో సిపిఎం నాయకులు జి. బుజ్జయ్య, జె. శేషమ్మ. ఎస్ కె బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఏచూరి' చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జొన్నలగడ్డ వెంకమరాజు

మండల కార్యదర్శిగా గండవరపు బుజ్జయ్య

మండల కార్యదర్శిగా గండవరపు బుజ్జయ్యను మహాసభలో ఎన్నుకున్నారు.

కాంక్రీట్ గోడ నిర్మించాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు

పెన్నానదీకి రక్షణ గోడ (కాంక్రీట్ వాల్)ను ప్రభుత్వం తక్షణమే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఆదివారం జనార్ధన్‌రెడ్డి కాలనీ సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ, ఆలీనగర్ ప్రాంతాల్లో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్న ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 54 డివిజన్ జనార్దన్ రెడ్డి కాలనీ పక్కన నదిగా అనుకున్న భగత్ సింగ్ కాలనీ అలీ నగర్ అనేక ప్రాంతాలు పెన్నా నది ఒడ్డున ఉన్నాయన్నారు. వరదలు సంభవించిన ప్రతి సారీ ఈ ప్రాంతాలు ముంపుకు గురౌయ్యాయన్నారు. గత ప్రభుత్వ హాయాంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా వ్యవహరించిన అనిల్‌కుమార్ యాదవ్ వరదలు సంభవించిన సమయంలో ఈ ప్రాంతం ముంపుకు గురికాకుండా ఉండేందుకు రక్షణ గోడ నిర్మిస్తామని రూ.99 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారన్నారు. గతంలో వరదులు వచ్చిన సమయంలో అప్పటి సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ప్రాంతాల్లో పర్యటించి రక్షణ గోడ నిర్మిస్తామని హామీలు ఇచ్చారన్నారు. మూడేళ్ళు పూర్తయినా ఇప్పటివరకు కేవలం ఒక 200 వందల మీటర్లు దూరం మాత్రమే రక్షణ గోడ నిర్మించారన్నారు. వరదలు వచ్చిన ప్రతి సారి ఈ ప్రాంతంలో నివాసం ఉన్న నిరుపేదలు లక్షలు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కాంక్రీట్ గోడ పనులు పూర్తి చేయాలని మంత్రి నారాయణను కోరుతున్నామన్నారు ఎఐవైఎఫ్ నాయకులు బాదుల్లా సాబ్ భాషా గౌస్ బాషా షబ్బీర్ ఖాజా సుల్తాన్ సబ్జాన్ బాబాయ్ ఉన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

ఇస్కపాలెంలో తాగునీటి సమస్య..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలం ఇస్కపాలెం పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఒకటి రెండు రోజులు కాదు గత పది రోజు లకుపైగా ఈ గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకొంటే "తప్పులో కాలేసినట్టే". సాక్షాత్తు మండల కేంద్ర గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనడం గమనార్హం. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి ఏర్పడి న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించక పోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులకు పైగా తాగు నీటి ఎద్దడి నెలకొన్న అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు జోక్యం చేసుకొని యుద్ధ ప్రతిపదికన చర్యలు తీసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరముంది

రీచ్‌లు లేని ప్రాంతాల్లో ప్రభుత్వమే ఇసుక సరఫరా చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో ఇసుక రీచ్‌లకు దూరంగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వమే ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి ఆప్రాంతం నుంచి అవసరమైన వారికి ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సిపిఐ కానీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇసుక రీచ్‌లు ఉన్న ఉన్న ప్రాంతాలకు ఇసుక తీసుకుని వెళ్లాలంటే ట్రాక్టర్, లారీ బాడుగలు చాలా ఎక్కువ కావడంతో సామాన్య ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే ఇసుక రీచ్లకు దూరంగా ఉండే ప్రాంతాలకు ఇసుకను తరలించేందుకు అనువుగా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసుకోని అక్కడ నుంచి ఎవరికైతే ఇసుక అవసరమో వారికి ప్రభుత్వ అధికారులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షానవాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల సంబరాలు అయితే జరుపుకుంటున్నారు కానీ సామాన్య ప్రజలకు ఇసుక అందించడంలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందాలని తక్షణం అధికారులు ఈ విషయంపై దష్టి పెట్టి సామాన్య ప్రజలకు ఇసుకను అందించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. . సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ ఇసుక పంపిణీ విషయంలో గత ప్రభుత్వం నిర్ణయాలు సరికాదని చెప్పిన కూటమి ప్రభుత్వం ఈరోజు తాము చేస్తున్నటువంటి విధానాలకు చెప్పిన మాటలకు పొందుతున్న లేకుండా ఉందని కనుక సామాన్య ప్రజలకు ఇసుకను తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే ఉద్యమిస్తామన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

ఇంజినీర్లు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ఎపి పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిలా అధ్యక్ష, కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, పి.దామోదర్ ఎన్నికైయ్యారు. ఆదివారం మాగుంట లే అవుట్ ప్రాంతంలోని ఓ ప్రయివేట్ భవన్‌లో ఏపి పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు .రాష్ట్ర కార్యదర్శి కె.వి.శేషారెడ్డి, డిస్కం కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌లు ముఖ్య అతిధులుగా హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్స్ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్క ఇంజనీర్ ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.వి.రాంప్రసాద్, కోశాధికారిగా ఎన్.గిరిధర్, ఆర్గనైజింగ్ మహిళా కార్యదర్శిగా జమీలను ఎన్నుకున్నారు. నగర, రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి, డివిజన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :

కందుకూరు ఫైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు, ఊరిబయట శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు ఈ మధ్య కురిసిన వర్షాలకు బట్టలు లేక ఇబ్బంది పడుతున్నారు అని తెలుసుకున్న ఫైన్ ఫౌండేషన్ వెంటనే స్పందించి వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీమ్ మాట్లాడారు. ఫౌండేషన్ ప్రతినిధులు వ్యాయామ ఉపాధ్యాయులు కరిముల్లా, నయీమ్ భాష, మస్తాన్, డాక్టర్ రాయ్ ఉన్నారు..

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు :

దసరా పారువేట సందర్భంగా అంకమ్మ తల్లి భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయ నిర్మాణానికి పెద వెంకన్నపాలెం గ్రావ ఎస్తులు కష్ణమ్మనేని అనిల్ కుమార్ ధర్మపత్ని అలేఖ్య కుమారుడు ధ్రువ, కుమార్తె మయూక కలసి రూ 25,116, అద్దంకి మాలకొండయ్య భార్య కమలమ్మ (మొగిలిచర్ల) రూ 5,116, అజ్ఞాత భక్తుడు రూ 516 విరాళముగా ఇచ్చారు. అమ్మ వారి ఆలయ కమిటీ సభ్యులైన ఏనిమిరెడ్డి వెంకటరెడ్డి చేతులు మీదగా అందజేశారు.

సిపిఎం శాఖా మహాసభలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని అన్నారు. ఆదివారం చెర్లో రమణారెడ్డి భవన్ సిపిఎం కార్యాలయంలో పట్టణంలోని మూడో వార్డు లక్ష్మణరావుపల్లి శాఖా మహాసభలు నిర్వహించారు. శాఖా మహాసభకు 15మంది సభ్యులు ఉండగా 13 మంది సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై సభ్యులతో చర్చించారు. అనంతరం ఎల్ఆర్ పల్లి శాఖ కార్యదర్శిగా మరోసారి షేక్ సంధానిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సభ్యుల చర్చల్లో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుండి ఆర్టిసి బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. చింతచెట్ల వాసుల నివాసాలపై ఎదుర్కొంటున్న సమస్యలపై అండగా నిలిచి వారికి శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. ఎస్ఎంకె పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి వాకర్స్‌కు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. అలాగే చిన్న పిల్లల ఆట స్థలంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పలు రకాల కార్యాలయాలు ఉన్నాయని, పలురకాల పనులపై ప్రజల నిత్యం రాకపోకలు అధికంగా ఉంటాయన్నారు. ఆ ప్రాంతంలో ఒక సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, వీటిపై సమావేశంలో చర్చించినట్లు సిపిఎం నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూతనంగా ఎన్నికైన షేక్ సంధాని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, ఆళ్ళ హాజరత్తయ్య, చలపతి, పోలయ్య, వాగాల శ్రీహరి, కృష్ణమోహన్, వెంకటరామిరెడ్డి, కాలేషా, హసీన్, పలువురు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎఎస్‌పేట శాఖా మహాసభలు పట్టణంలోని సిపిఎం ఆధ్వర్యంలో శాఖా మహాసభలు నిర్వహించారు. మండలంలోని ప్రజల సమస్యలపై పోరాటాలు చేసి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ శాఖ సమావేశం 9 మంది సభ్యులతో సమావేశం నిర్వహించారు. నూతన కార్యదర్శిగా మొగల్ నిస్సార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిపిఎం నేతలు గంట లక్ష్మీపతి, అస్లాం, హజరత్తయ్య, అల్లా హుస్సేన్, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : 37వ డివిజన్ శాఖ మహాసభ మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం జరిగింది. మహాసభ శాఖ కార్యదర్శిగా ఆర్ వి రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

29వ డివిజన్ విఎంఆర్ నగర్ సిపిఎం శాఖ మహాసభ ఆదివారం విఎంఆర్ నగర్‌లోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. కార్యదర్శిగా దేవతాటి రాజాను శాఖ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

29వ డివిజన్ విఎంఆర్ నగర్ సిపిఎం మహిళా శాఖ మహాసభ శాఖ కార్యదర్శిగా షేక్ జాకిరాను మహాసభ ఎన్నుకున్నారు.

21వ డివిజన్ ఉమారెడ్డి గుంట సిపిఎం శాఖ కార్యదర్శిగా సిహెచ్ రత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజా సమస్యలపై చర్చించారు.

ఆహార పొట్లాలు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు కావలి శాసనసభ్యులు డి.వెంకట క్రిష్ణారెడ్డి పి.ఎ. మామిడాల. సాయికుమార్, ఆయన సతీమణి మామిడాల.మానస జన్మదినం సందర్భంగా ఆదివారం కావలి పట్టణం తుపాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు, జంగాల కాలనీలో పిల్లలకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ద్వారా చికెన్ బిర్యానీ భోజనం పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా సాయికుమార్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు. అలాగే ఈ రోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న మామిడాల.మానసకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-బిట్రగుంట

చిన్నతనం నుండే పిల్లలు ఒకరినొకరు ప్రేమ కలిగి మెలగాలని పాస్టర్ రెవరెండ్ డానియేల్ బాబు పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో ఉన్న హోరేబు ప్రార్థన మందిరంలో 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు పిల్లలకు బైబిల్ విరామ పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించి కథలను, పాటలను పిల్లలకు నేర్పించారు. పాస్టర్ డానియల్ బాబు, సంతోషమ్మ పిల్లలకు దేవుని యొక్క సందేశాన్ని అందిచ్చి వారికి బైబిల్ వాక్యాలపై పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ కాపర్లు ఏలియా బాబు, ఇమ్మానియేల్, ప్రభాకర్, రవీంద్రబాబు, జకరయ్య, రమేష్, తిరుపాలు, సిస్టర్స్ జానకమ్మ, చిట్టెమ్మ, హెప్సిబా, ప్రశాంతి, పద్మ, రాహేలు, సునీత, సంగీత, స్విస్ మేరీ, లత, ప్రభావతి, రూతు, సంఘ కాపరులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కావలి : మండలంలోని నడింపల్లి గ్రామంలో అనాథైన కల్లగుంట.సాయి రామ్‌రెడ్డి(76)కి ఆదివారం సంయుక్త సేవాసంస్థ సభ్యులు డాక్టర్ నళినీపద్మ, తన్నీరు.రవికుమార్, అళహరి రామక్రిష్ణ, వేమూరు.సురేష్ బాబు, సిద్ధార్థ మణికంఠ, జి.లిఖితల సహకారంతో నడింపల్లి గ్రామ నివాసి నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి పెనుబాపల వెంకటేశ్వర్లు సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో నడింపల్లి గ్రామస్తులు వెంకయ్య, రమణ, రామకృష్ణ, రామారావు, శీను, నరసింగరావు, నగేష్, ధను, సంయుక్త సేవాసంస్థ ద్వారా ఆసిఫ్ కేర్ అంబులెన్స్ సర్వీస్ వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడారు. నడింపల్లి గ్రామంలో సాయి రామ్‌రెడ్డి అనే వృద్ధుడు చనిపోయారని అతని అంత్యక్రియలకు సంయుక్త సేవాసంస్థ ద్వారా సహాయం చేయమని కావలి మండలం అన్నగారిపాలెం పంచాయతీ, నడింపల్లి గ్రామం కార్యదర్శి షేక్ అబ్దుల్ హమీద్ తనను కోరినట్లు తెలిపారు. సాయిరామ్‌రెడ్డి గురించి తమ సంస్థ సభ్యులకు తెలియజేసిన వెంటనే స్పందించి, సహాయం అందజేశారని, వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అలాగే సాయిరామ్‌రెడ్డిగా అంత్యక్రియలను నిర్వహించిన నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువతకార్యదర్శి పెనుబాపల. వెంకటేశ్వర్లుకు, నడింపల్లి వాసులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు



దుర్గామాతగా చిన్నారి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని పలు గ్రామాలలో దసరా సంబరాలు అమ్మవారి వేషధారణలో చిన్నారుల సందడి ప్రత్యేక పూజలతో అంబరాన్ని అంటాయి. దసరా నవరాత్రులు అమ్మవారు అనేక రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం కృష్ణారెడ్డి పల్లి గ్రామంలో కాకు వెంకటయ్య మనవరాలు నాగ వెంకట సాత్విక అమ్మవారి వేషధారణతో ఆకర్షణీయంగా నిలిచింది. గ్రామాలకు వలసలపై చదువులపై వెళ్లిన వారు తిరిగి రావడంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొనడంతో అమ్మవారికి పూజలు నిర్వహించడంతో భక్తులు అమ్మవారికి కాయకర్పూరం నైవేద్యాన్ని సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే పెను విషాదమే..

- డిఎఫ్ఒ వి.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

దసరా, దీపావళి పండుగ వచ్చిందంటే చాలు.. వయస్సుతో నిమిత్తం లేకుండా ఇంటిల్లిపాది సంబరాలు జరుపుకోవడంలో మునిగిపోతారు. దసరా పండుగ సందర్భంగా ఆలయాల వద్ద, అమ్మవారి ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఊహించని విధంగా ప్రమాదాలు చోటు చేసుకొని విషాదాన్ని నింపుకోవాల్సి వస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలు లేని దీపాల వెలుగులో కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందోత్సాల మధ్య ఈ పండుగల సంబరాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. సంతోషంగా.. అనందంగా టపాసులు కాల్చేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డిఎఫ్ఒ శ్రీనివాసరెడ్డి మాటల్లో...

ప్రశ్న. పండుగల సమయంలో టపాసులు కాల్చే సమయంలో ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా కుటుంబ సభ్యులందరూ ఆనందంగా జరుపుకోవాలంటే అగ్నిప్రమాదాల నివారణకు ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాపారస్తులకు, ప్రజలకు మీరు అందజేస్తున్న సలహాలు, సూచనలు ఏమిటీ..?

జవాబు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు రోజు, దీపావళి పండుగ రోజు పిల్లలు, పెద్దలు టపాసులు పేల్చేందుకు నిప్పు అంటించి దూరంగా వెళ్లడం.. టపాసు పేలుతుందని కొద్ది సమయం వేచి చూడటం రొటీన్‌గా చూస్తుంటాం. అయితే నిప్పు అంటించిన టపాసు పేలలేదని నిర్లక్ష్యంగా కాలితో పక్కకు తోయడం, తిరిగి మళ్లీ నిప్పు పెట్టడం వంటివి చేస్తుంటారు. ఈ విధంగా చేయడం చాలా తప్పు. అటువంటి సమయంలో టపాసులు ఒక్కసారిగా పేలుతుంది. ఏ మాత్రం ఊహించని విధంగా టపాసులు పేలడంతో పెను ప్రమాదానికి గురికావాల్సి వస్తుంది. దానిని గుర్తించి పేలని టపాసులపై నీటిని పోసివేయాలి. ఈ పనిచేయడం వల్ల ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. క్రాకర్స్ కాల్చే సమయంలో నిప్పు రవ్వలు ఎగిరి ఒంటిమీద పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి చిన్న,పెద్దా అన్న తేడా లేకుండా ప్రతిఒక్కరూ కాటన్ దుస్తులు ధరించడం, కళ్లకు అద్దాలు పెట్టుకోవడం, కాళ్లకు చెప్పులు వేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మంచిది. క్రాకర్స్ కాల్చే సమయంలో పరిసర ప్రాంతాల్లో గుడిసెలు, గడ్డివాములు, గోదాములు ఉంటే అగ్నిప్రమాదాలు జరిగితే ప్రమాద తీవ్రత తగ్గించేందుకు, నీటిని, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి, ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలి.

ప్రశ్న. టపాసులు విక్రయించేందుకు ప్రతేడాది తాత్కాలిక లైసెన్స్‌లు ప్రభుత్వం అందజేస్తుంది. ఈ ఏడాది ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంత మందికి అనుమతులు ఇచ్చారు. .?

జవాబు. క్రాకర్స్ విక్రయించేందుకు ప్రభుత్వం తాత్కాలిక లైసెన్స్‌లు ఇస్తుంది. అయితే ఈ తాత్కాలిక లైసెన్స్‌లు కావాలనుకొనే వారు వారి సమీప సచివాలయం, రెవెన్యూ, పోలీసు శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొని, అగ్నిమాపక శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటి వరకు (శనివారం) తాత్కాలిక లైసెన్స్ కోసం పది దరఖాస్తులు మాత్రమే అందాయి. జిల్లా ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు మేరకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి నగర, రూరల్ నియోజకవర్గాలకు వేరు వేరుగా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లు తీసుకున్న వారు ప్రభుత్వం కేటా యించిన ప్రాంతంలో మాత్రమే క్రాకర్స్ విక్రయించాలి. అందుకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ముఖాముఖి

ప్రశ్న. నగరంలో భారీ కట్టడాలు (అపార్టుమెంట్, హోటల్స్, రెస్టారెంట్లు, సినిమా హాళ్లు, కళ్యాణ మండపాలు) జోరుగా సాగుతున్నాయి. ఈ కట్టడాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొనే సమయంలో అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు ఏమైనా తీసుకోవాలా..?

జవాబు. నగరంలో, రూరల్ ప్రాంతాల్లో భారీస్థాయిలో భవన నిర్మాణాలు జరుగుతున్నది వాస్తవమే. అపార్టుమెంట్స్, హోటల్స్, కళ్యాణ మండపాలు, కార్పొరేట్ వైద్యశాలలు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు నిర్మాణాలు చేసే సమయంలో తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఎందు కంటే ఈ భవనాల్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో మంటలను అదుపు చేసేందుకు ఫైర్ ఇంజన్లు, ఫైర్‌మెన్లు వెళ్లేందుకు అనుకూలంగా, విశాలమైన స్థలం ఉండాలి. అంతేకాకుండా అగ్ని ప్రమాదాలను నివారించేందుకు పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, మంటలను అదుపు చేసేందుకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేయాలి. ఇటువంటి సదుపాయాలు లేకుండా భారీ భవనాలు నిర్మిస్తే అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో మంటలను అదుపు చేయడం కష్టమ వుతుంది. అందుకు ఉదాహరణ ఇటీవల నగరంలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రభుత్వ నియమనిబంధనలు పాటించి భవన నిర్మాణాలు చేయడం వల్ల మంటలను నియంత్రించేందుకు, ఆస్థి నష్టాన్ని నివారించేందుకు సాధ్యమైంది.

గిరిజన మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రాపూరు

మండలంలోని మద్దెలమడుగు గ్రామంలో గిరిజన మహిళ ఏకోలు చెంచులక్ష్మీ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఘటన ఆదివారం జరిగింది. వివరాల మేరకు.. రాజంపేట వద్దనున్న మందరం కొత్తపల్లి సిమెంట్ బ్రిక్స్ వద్ద ఆమె భర్త ఏకోలు రవి దావీదు పని చేస్తున్నారు. చెంచులక్ష్మీ తన భర్తను బట్టీల యజమాని కిడ్నాప్ చేశాడని, అతనిని వదిలిపెట్టాలని వేడుకుంది. అయినా ఆ యజమాని కనుకరించలేదు. ఈ నేపథ్యంలో చెంచులక్ష్మీ దిగాలు చెందింది. భర్త లేకపోతే తన ముగురు బిడ్డల పరిస్థితి ఏమిటని ఆవేదన చెందింది. ఈ నేపథ్యంలో మద్దెలమడులోని ఆమె నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి స్వగ్రామం సొంతూరు డక్కిలి మండలం. దందోలు గ్రామం. చెంచులక్ష్మీ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ ఎం. సుభద్ర పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా స్థానిక కార్యాల యంలో ఆమె మాట్లా డుతూ ఉదయగిరి రెవెన్యూ కార్యాలయంలో ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని పొంచి ఉన్న వర్షం కారణంగా మండలంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబరుకు 9989502077 ఫోన్ చేసి సమాచారం తెలపాలని వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. షిఫ్ట్ వారిగా సిబ్బందిని 16వ తేదీ వరకు నియమించామన్నారు.

మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ధరల భారాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పెరుగుతున్న నిత్యావసర వస్తువులు ధరల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అరికట్టడానికి సిపిఎం మండల కమిటీ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బిజ్జంపల్లి గ్రామంలో పెరుగుతున్న నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని గ్రామస్తులతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ప్రజా పంపిణీ ద్వారా 16రకాల సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కాలం అతివృష్టి అనావృష్టితో ప్రభుత్వం సకాలంలో సరైన చర్యలు చేపట్టాకపోవడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజలు జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడిందని వాపోయారు. నిరుద్యోగ సమస్య, వ్యవసాయం లేక వలసలు గ్రామీణ ప్రాంతాలలో పనులు లేక సుదూర ప్రాంతాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయన్నారు. రోజురోజుకు ధరల ప్రభావం ప్రజలను కోలుకోలేని దెబ్బ తీసిందని రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.80 కిలో దాటాయని కందిపప్పు రూ.95 నుండి రూ.180 చేరిందని, టమాటో రూ.80, ఉల్లి పాయలు రూ.60 దాటిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాదితో పోలిస్తే 100శాతం నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు పేద ప్రజలు నడ్డి విరిగేట్టుగా రాష్ట్ర ప్రభుత్వం తీరు కనబడుతుందని, ఎన్నికల ముందు ప్రభుత్వాలు ధరలు అదుపు చేస్తామని, ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలి చివరకు పేద ప్రజల విద్య, వైద్య పట్టించుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు స్థానిక రైతులు పాల్గొన్నారు.

15న కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని ఇస్కపల్లిలో అక్టోబర్ 15న గుండె, కేన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జయరాం, డాక్టర్ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ శిబిరంలో ఎత్తు, బరువు, బ్లడ్ ప్రెషర్, జిఆర్‌బిఎస్, ఇసిజి గుండె కేన్సర్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేయనున్నారు. కనుక సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

ప్రజాశక్తి-కావలి

ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా శనివారం రాత్రి హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో మృతి చెందడం విచారకర మని, ఆయన మృతికి సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి ప్రకటనలో సంతాపం తెలియజేశారు. మానవ హక్కుల నేతగా పనిచేస్తున్న సాయిబాబాను కేంద్ర బిజెపి ప్రభుత్వం "ఊపా" చట్టం కింద అక్రమంగా నాగపూర్ జైలులో 10యేళ్ళపాటు అక్రమంగా నిర్బంధించినందునే ఆయనకు అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయని, లేకపోతే ఆయన మరో పదేళ్లపాటు ప్రొఫెసర్‌గా పనిచేసి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాజ్యహింసలను, రాజ్య హత్యలను ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. సాయిబాబా కుటుంబానికి తన సంతాప సానుభూతులను తెలియజేశారు.

ప్రభుత్వ హింసతోనే ప్రొఫెసర్ మృతి : ప్రభుత్వ హింసతోనే ప్రొఫెసర్ సాయిబాబా మృతి చెందాడని మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల సాధనకోసం సామాజిక వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రొఫెసర్‌గా ఉంటూ, హక్కుల పోరాటాన్ని సాగించినందుకు 'ఉపా' చట్టం కింద అబద్ధపు కేసుల్లో ఇరికించి కేంద్ర ప్రభుత్వం 90శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబాను తొమ్మిదే ళ్లపాటు జైలుపాలు చేసిందన్నారు. ఆయన కుటుంబం చేసిన న్యాయ పోరాటం వలన ఆయనను ఈ సంవత్సరం మార్చిలో విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. తొమ్మిదేళ్ల పాటు జైలులో ప్రొఫెసర్ సాయిబాబా ఎదుర్కొన్న అనారోగ్య సమస్యలు, శారీరక మానసిక ఇబ్బందులన్నీ ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేయగా, చివరకు ఆయన గుండెజబ్బుతో మరణించారాని తెలిపారు. వామపక్షాలు, విప్లవ కమిటీలతో పాటు ప్రజాతంత్ర వాదులు, విప్లవ నివాళులర్పిస్తున్నారు. సాయిబాబాలాంటి మాన వహక్కుల నేతను బెయిల్ ఇవ్వకుండా జైలుపాలు చేయడం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశానికి ప్రపంచదేశాల ముందు తలదించుకునే విషయమన్నారు. యువత నేడు నిస్తేజంగా, సామాజిక చైతన్య రహితులై, పెడదారులు పట్టడం, దేశ భవితవ్యానికి తీరని నష్టమన్నారు. సాయిబాబా వంటి మేధావుల వల్లే నేటి యువత మానవ హక్కుల కోసం పోరుబాట పడితే గానీ తిరోగమనం పడుతున్న నేటి సమాజం మారదన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాకు జన నివాళులు తెలిపారు.

మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండల కమిటీ సమావేశంలో నాయకులు

మండలంలోని నరుకూరు సెంటర్‌లో 15వ తేదీ మంగళవారం నిర్వహించనున్న సిపిఎం మండల మహాసభను జయప్రదం చేయాలని మండల కమిటీ పిలుపునిచ్చారు. ఆదివారం నరుకూరులో సిపిఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు, మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, సభ్యులు కాల్తిరెడ్డి రవణమ్మ, మారుబోయిన రాజా, మధు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 10 గంటలకు సిపిఎం మండల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మద్యం దుకాణం వద్దు..

నరుకూరు సెంటర్‌లో జన నివాసాల మధ్య బ్రాందీ షాపు పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని సిపిఎం మండల కమిటీ సూచించింది. మద్యం దుకాణాన్ని పెడితే పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ తీర్మానించింది.

జయప్రకాష్ నారాయణకు నివాళులు

ప్రజాశక్తి-కావలి

స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్ట్ నాయకుడు జయప్రకాష్ నారాయణ ప్రజా ప్రతినిధులకు రాజకీయ పార్టీ నాయకులకు ఆదర్శప్రాయుడని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. 122వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ లోకనాయక్ జయప్రకాష్ నారాయణ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం అనుభవించి తదనంతరం భారతదేశంలో చేసి ఎమర్జెన్సీ వ్యతిరేకంగా పోరాడి జనతాపార్టీని ఏర్పాటు చేసి అధికారంలోకి తీసుకురావడంలో ఎనలేని కృషి చేసిన గొప్ప ప్రజాస్వామికవాది ఆయన బీహార్ రాష్ట్రంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి బ్రహ్మచారిగా జీవితాంతం జీవించి అవినీతికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి ఒక ప్రజాస్వామిక భారతదేశాని నిర్మించాలని జీవితాంతం కృషి చేసిన గొప్ప త్యాగశీలి జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. జీవితాన్ని భారతదేశ ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీలు ఆదర్శంగా తీసుకొని అవినీతి రహిత సోషలిస్ట్ సమాజాన్ని నిర్మించడానికి అందరూ కృషి చేయాలని కోరారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. భక్తి శ్రద్ధలతో 9 రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాన్ని విద్యుత్ దీపాలంకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఐక్యంగా ఉండాలి

- మాజీ ఎంఎల్‌సి బూదాటి రాధయ్య

ప్రజాశక్తి-కావలి

మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బిసి ఐక్యత భవన్ బడుగు బలహీనవర్గాలకు అండగా ఉండాలని మాజీ ఎంఎల్‌సి బూదాటి రాధయ్య శనివారం పేర్కొన్నారు. స్థానిక కావలి కోపరేటివ్ కాలనీలో బీసీ ఐక్యత భవన్ నూతన కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలేసి ఆయనతోపాటు బిసి నేతలు, రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం మేళ తాళాలతో శంకుధ్వనులతో జనరంజకంగా అక్కడ నుంచి పాదయాత్ర స్థానిక కోపరేటివ్ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన బిసి ఐక్యత భవన్ కార్యాలయంకు పాదయాత్రతో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎంఎల్‌సి బూదాటి రాధయ్య మాట్లాడుతూ కావలిలో బిసి ఐక్యత భవన్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం తన చేతుల మీదుగా చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. బిసి ఐక్యత భవన్ నాయకులు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉండాలని ఆయన కోరారు. బిసిలు రాజ్యాధికారం కోసం అందరు ఐకమత్యంగా కలిసి మెలిసి పోరాడాలని పదవులు గానీ రాజ్యాధికారం కానీ బిసిలకు ఎవరూ ఇవ్వరని ఎవరికి వారు స్వయం కృషితో పోరాటాలు చేసి సాధించుకోవాలని తాను ఎంఎల్‌సిగా ఎవరి అండదండలు లేకుండా స్వయం కృషితో అయ్యానని తెలిపారు. టిడిపి నాయకులు అడ్వకేట్ పొట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కావలిలో బిసి ఐక్యత భవన్ నూతన కార్యాలయం ప్రారంభం చేయడం చాలా సంతోషంగా ఉందని నాయకత్వం వహించేవారు బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండాలని ఆయన కోరారు. బిసి సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ మధుబాబు నాయుడు మాట్లాడుతూ కాలేజీలో చదువుకునే రోజుల్లో బిసి స్నేహితులతో కలిసిమెలిసి పెరిగామని, బిసిలు కూడా ఉద్యోగం రాజకీయాల్లో ఎదగాలని ఆయన కోరారు. బిసి ఐక్యత భవన్‌కు పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటామన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టి బిసిలు కలిసి పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని, దానికోసం అందరూ కలిసి పోరాటాలు చేయాలని బిసి ఐక్యత భవన్ కోసం వారి పోరాటాల్లో సలహాలు సూచనలు ఇస్తామని తమ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిజెపి నేత కుట్టుబోయిన బ్రహ్మానందం, బిసి నేతలు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, బిసి ఐక్యత భవన్ గౌరవ అధ్యక్షుడు ఉరిటి గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్నివరప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఆవులమంద శ్రీనివాసులు, ఆవుల శ్రీనివాసులు, కోదండపాణి, రమేష్, మధు, బిసి ఉద్యోగ నేతలు, వివిధ రాజకీయ పార్టీ నేతలు భారీ స్థాయిలో ప్రజలు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న దృశ్యం

సరుకులు అందజేత

ప్రజాశక్తి-బిట్రగుంట

కాంద్ర గంగినాయుడు కుమారుడు కాంద్ర సతీష్ ఆదరణ కేంద్రానికి, రూ.20వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు ఆదివారం వితరణగా అందజేశారు. గత మూడు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, ప్రతినెలా 1వ తేదీ తాము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సతీష్ నాయుడు ఫాలోవర్స్, ఆదరణ కేంద్ర డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం.7/2023
బిట్వీన్ :
1. Mokka Masthanaiah ...పిటిషనర్
వర్సెస్
1) MupparajuMahalakshmi &
10 Others ...రెస్పాండెంట్స్
To,
R1) Mupparaju Mahalakshmi
W/o Sudhakar,
R/o Gudluru vil / mandal,
SPSR. Nellore dt.
R3) Gottipati Sindhu,
W/o Mahidhar,
R/O Peddapadu Po/ Vil,
Kaligiri Mandal, SPSR Nellore dist.
1వ, 3వ రెస్పాండెంట్లకు నోటీసు
ఈ నంబరున పిటిషనర్ ఈ నెంబరు I.P. దాఖలు చేయగా, సదరు I.P.లో 1వ, 3వ రెస్పాండెంట్స్ అగు మీకు నోటీసు నిమిత్తం శ్రీ కోర్టు వారు తే.15-10-2024ది కి వాయిదా వేసి యున్నారు. కావునసదరు 1వ,3వ రెస్పాండెంట్స్ అగు మీరు ఆదినం ఉదయం 10.30.గంలకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలసి ఉన్నది. హాజరు కాని యెడల మీపరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
వాయిదా తే 15-10-2024ది.
ఇట్లు,
కే. సురేంద్ర రెడ్డి,
పిటిషనర్ తరుపు న్యాయవాది,
కావలి.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకల ముగింపు అనంతరం శనివారం విజయదశమి పండుగను అత్యంత వేడుకగా నిర్వహించారు. పట్టణంలోని జ్వాలాముఖి ఆలయం సుందరమ్మ, కన్యకా పరమేశ్వరీ ఆలయం, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం, కాశీ నాయన ఆలయాలతో పాటు కోదండ రామాలయం, సంతాన లక్ష్మి ఆలయంలోనూ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై మేళ తరాలతో, భాజా భజంత్రీలు, డీజే, సంగీత నృత్యాలు, బాణసంచా వేడుకలు నడుమ పట్టణంలో అమ్మవార్ల ఉత్సవాలు అత్యంత సోపాయమానంగా నిర్వహించారు. భక్తులు అమ్మవాళ్ళ అలంకరణలు చూసేందుకు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకున్నారు. గ్రామోత్సవంలో తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన అమ్మవార్లకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజాశక్తి-వింజమూరు ం వింజమూరులో విజయదశమి ఉత్సవాలు 12వ తేదీ శనివారంతో ముగిశాయి. 3వ తేదీ నుండి ప్రారంభమై 12వ తేదీ వరకు విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వింజమూరులోని శ్రీవిద్య పరమేశ్వర ఆలయంలో శ్రీ గంగా అన్నపూర్ణ కాశీ విశ్వనాథుని ఆలయంలో అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలను అత్యంత వైభవంగా పది రోజులపాటు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఇబ్బందులు జరగకుండా ఆలయ ధర్మకర్తల పరిరక్షణలో విజయవంతంగా ముగిశాయి.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం తుపాన్ నగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో ఆ సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు ఆదివారం నిత్యావసర వస్తువులు, బియ్యం, ప్రతినెలా పోస్టాఫీసులో నగదు జమ చేస్తున్న పాస్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సభ్యులు ఎమ్ వి ఎన్ ప్రసాదరావు, షేక్ ఖాధర్ బాషా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సభ్యులు ఎమ్ వి ఎన్ ప్రసాద రావు, షేక్ ఖాదర్ బాషాలు మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా పేద పిల్లలను సంరక్షించడం అభినందనీయమని పేర్కొన్నారు. సంయుక్త సంరక్షణలో ఉన్న పిల్లలు ఎంతో ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పిల్లలను దత్తత తీసుకోని సహాయం అందజేస్తున్న దాతలను అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పేద పిల్లలను సంరక్షిస్తున్న దాతలు డాక్టర్ బి.రాజేంద్ర ప్రసాద్ - రాధ దంపతులకు, డాక్టర్ బి.సతీష్ - డాక్టర్ పి.ఉషారాణి దంపతులకు, డాక్టర్ కె.ఆనంద్ కుమార్ - డాక్టర్ టి.మాధవీలత దంపతులకు, డాక్టర్ పి.పద్మజకు, డాక్టర్ పార్ధసారథి రాజు -డాక్టర్ ఉషారాణి దంపతులకు, డాక్టర్ జాహ్నవికి, డాక్టర్ పి శ్రీధర్ - డాక్టర్ కె.ఝాన్సీ దంపతులకు, ఎమ్.నితిన్ కుమార-నిఖిల దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.